ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
శుక్రవారం 3 మే 2024

ఓటు వేయి.. బలిమి చేయి



స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ముందు ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ (ఫైల్)

- అసెంబ్లీతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో తక్కువ పోలింగ్ నమోదు
- అవగాహన కల్పిస్తున్నప్పటికి ఆసక్తి చూపని అర్బన్, యువ ఓటర్లు
- ఈసారి నువ్వా - నేనా అన్నట్లుగా పోటీపడి ప్రచారం చేస్తున్న అభ్యర్థులు
- పోలింగ్ శాతం పెంచేందుకు పార్టీల కసరత్తు.. వలస ఓటర్లపై నజర్
- గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో 70శాతానికి పైగానే ఓటింగ్‌లో పాల్గొన్న ప్రజలు

మహబూబ్‌నగర్, మే 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అనేది కీలకమైన అస్త్రం.. ఆ ఓటును అన్ని ఎన్నికల్లో కచ్చితంగా వినియోగించుకోవాల్సి ఉంటుంది. అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికలు కలిసి వచ్చే చోట పోలింగ్ శాతం ఎక్కువగా నమోదవుతుండగా.. అసెంబ్లీ ఒక సమయంలో.. పార్లమెంట్ ఎన్నికలు మరోసారి జరుగుతున్న రాష్ట్రాల్లో మాత్రం పోలింగ్ శాతం చాలా తక్కువగా నమోదవుతోంది. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లో చూపెట్టిన బాధ్యతను ఓటర్లు పార్లమెంట్ ఎన్నికల్లో చూపడం లేదు. దీనివల్ల పోలింగ్ శాతం చాలా తక్కువగా నమోదవుతోంది. వందశాతం ఓటర్లు పాల్గొనాల్సిన ఎన్నికల్లో కేవలం 60 నుంచి 65 శాతం మంది మాత్రమే పాల్గొంటున్నారు. 2014 వరకు రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలతో పాటే తెలంగాణ అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరిగాయి. 2018లో అప్పటి సీఎం కేసీఆర్ ముందస్తుగా ప్రభుత్వాన్ని రద్దు చేసి.. ఎన్నికలకు వెళ్లారు. దీంతో ఆ ఎన్నిక నుంచి ఓటింగ్ సరళిలో కూడా వ్యత్యాసం నమోదవుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం జమిలి ఎన్నికల విధానాన్ని తీసుకురావాలని ఆలోచించ డానికి ఇది కూడా ఒక కారణమని చెప్పవచ్చు. జమిలి ఎన్నికల వల్ల ప్రతీసారి ఎన్నికల ఖర్చు, అనవసర వాగ్దానాలు, ఉచిత పథకాలు బెడద, పోలింగ్ శాతం పెరుగుదల సాధ్యమయ్యే అవకాశాలు ఉంటాయి. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలు ఉండగా.. ప్రస్తుతం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసి.. అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం చేస్తున్నారు. ప్రతీసారి ఎన్నికల్లో ప్రధాన పోరు రెండు పార్టీల మధ్యలో ఉండగా.. ఈ ఎన్నికల్లో త్రిముఖ పోరుగా మారింది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌ల అభ్యర్థు లు నువ్వా.. నేనా అన్నట్లు ప్రచారంలో దూసుకు పోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 70శాతానికి పైగా ఓటింగ్ నమోదు కాగా.. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ నమోదుపై అభ్యర్థులు ఆశలు పెట్టుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంతో సమానంగా పార్లమెంట్ ఎన్నికలను కూడా అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో.. ఓటింగ్ శాతం పెరుగుతుందనే ఆశలో ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన ఓటింగ్ శాతం

మహబూబ్‌నగర్		నాగర్‌కర్నూల్ పార్లమెంట్	
నారాయణపేట	78.29%	కల్వకుర్తి	83.23%
మహబూబ్‌నగర్	70.41%	వనపర్తి	77.54%
జడ్చర్ల	81.18%	గద్వాల	82.42%
దేవరకద్ర	82.33%	అలంపూర్	79.97%
మక్తల్	77.9%	నాగర్‌కర్నూల్	78.50%
షాద్‌నగర్	81.96%	అచ్చంపేట	70.40%
కొడంగల్	70.50%	కొల్లాపూర్	79.89%

కొత్త ఓటర్లు పెరుగుతున్నా...

జనాభా పెరుగుదలకు అనుగుణంగానే ఓటర్ల సంఖ్య కూడా రోజురోజుకూ పెరుగుతోంది. ఓటర్ల సంఖ్య పెరిగితే పోలింగ్ శాతం కూడా పెరగాలి. కానీ పోలింగ్ శాతం తగ్గుతోంది. ప్రధానంగా అర్బన్, యువ ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనడానికి ఆసక్తి చూపకపోవడం ఇందుకు కారణమని తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఈ వ్యత్యాసం స్పష్టంగా కనిపించింది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ సెగ్మెంట్‌లోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో 75శాతానికి పైగా పోలింగ్ నమోదు కాగా.. కేవలం అర్బన్ ఓటర్లు అధికంగా ఉన్న మహబూబ్‌నగర్ అసెంబ్లీ స్థానంలో మాత్రం 70.41శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. ఆ తర్వాత స్థానంలో వలస ఓటర్లు ఎక్కువగా ఉన్న కొడంగల్‌లో 70.50శాతం పోలింగ్ నమోదైంది. ఇది పార్లమెంట్ ఎన్నికల్లో మరింత తగ్గే అవకాశం ఉంటుంది. 2009 పార్లమెంట్ ఎన్నికలు, అసెంబ్లీతో కలిసి రావడం వల్ల రెండు పార్లమెంట్ నియోజకవర్గాలు కలిపి 9.32లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకోలేదు. 2014 ఎన్నికల్లో 7.79లక్షల మంది ఓటు వేయలేదు. 2019 ఎన్నికలకు వచ్చే సరికి ఆ సంఖ్య 11.12లక్షలకు పెరిగింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని నియోజక వర్గాల్లో దాదాపు 70శాతం పైగానే పోలింగ్ నమోదైంది. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా అంతకంటే ఎక్కువ స్థాయిలో పోలింగ్ నమోదు కావాలని అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా వలస ఓటర్లపై ఎక్కువగా పార్టీలు దృష్టి పెడుతున్నాయి. రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో వలస ఓటర్ల సంఖ్య అధికంగానే ఉంటుంది. నారాయణపేట, కొడంగల్, వనపర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూలు, కల్వకుర్తి, మక్తల్, దేవరకద్ర అసెంబ్లీ సెగ్మెంట్లలో వీరి శాతం అధికంగా ఉంటుంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఓటర్లపై బీఆర్‌ఎస్ ఎక్కువగా దృష్టి పెట్టగా.. ఈసారి చాలా నియోజకవర్గాల్లో వలస ఓటర్లను పెద్దగా పట్టించుకోలేదు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఖర్చు భరించి.. మరీ ముంబై, పూణె, భీవండి, హైదరాబాద్, బెంగళూరులాంటి ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాలు పెట్టి మరీ ఓటర్లను రప్పించేవారు. కానీ పార్లమెంట్ ఎన్నికల్లో అంత ఖర్చు భరించే పరిస్థితి ఉండదు. కానీ ఈసారి వారిపైనే ఎక్కువగా దృష్టి సారించారని తెలుస్తోంది.

గత పార్లమెంట్ ఎన్నికల్లో ఇలా...

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పార్లమెంట్‌కు జరుగుతున్న మూడో ఎన్నిక ఇది.. 2014 ఎన్నికల్లో పార్లమెంట్, అసెంబ్లీ కలిపి రావడంతో ఎక్కువగా ఓటింగ్ నమోదైందని చెప్పవచ్చు. 2009లో నమోదైన ఓటింగ్ కంటే 2014లో అధికంగా నమోదైంది. 2009లో మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో 13.68లక్షల ఓటర్లు ఉంటే.. 9.24లక్షల ఓటర్లు తమ ఓటును వేయడంతో 67.54శాతం పోలింగ్ నమోదు కాగా.. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో 14.60లక్షల ఓటర్లకు గాను 10.21 లక్షల ఓట్లు పడటంతో 69.97శాతంగా పోలింగ్ నమోదైంది. 2014 వచ్చే సరికి మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో 14.18లక్షల ఓటర్లకు గాను.. 10.09లక్షల మంది ఓటు వేయగా.. 71.14శాతం పోలింగ్ నమోదైంది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో 14.77లక్షల మంది ఓటర్లగాను 11.06లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకోగా.. 74.92 శాతం పోలింగ్ నమోదైంది. 2019 వచ్చేసరికి పార్లమెంట్ ఎన్నికలు అసెంబ్లీ తర్వాత జరగ్గా.. పోలింగ్ శాతం తగ్గింది.. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో 15.01లక్షల ఓటర్లకు గాను 9.84లక్షల మంది ఓటు వేయడంతో 65.55శాతం, నాగర్‌కర్నూలు పార్లమెంట్ పరిధిలో 15.88లక్షల ఓటర్లగాను గాను.. 9.93లక్షల మంది ఓటుహక్కు వినియోగించుకోవడంతో 62.51శాతం పోలింగ్ నమోదైంది. లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ ఎక్కువ శాతం నమోదు కావడం కోసం స్వీప్ (సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) ద్వారా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ర్యాలీలు, హోర్డింగ్‌లు, వీవీ ప్యాట్ నమూనాలు, అవగాహన కల్పించే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. గతంతో పోల్చితే 12డీ ఫాం ద్వారా ఇంటి వద్ద ఓటు, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళతరం చేయడం వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టినా.. ఫలితం ఉండటం లేదు. ప్రతీ ఓటర్ ఓటు బాధ్యత అని గ్రహిస్తేనే ఇందులో కొంత మార్పు వచ్చే అవకాశం ఉంది.

కాంగ్రెస్‌తోనే ప్రజాస్వామ్యం

- ఎర్రవల్లిలో లక్ష మందితో సభ
- హాజరు కానున్న రాహుల్ గాంధీ
- సభా స్థలిని పరిశీలించిన మల్లు రవి, నాయకులు



ఎర్రవల్లిలోని రాజీవ్ గాంధీ ప్రాంగణంలోని సభాస్థలి పనులను పరిశీలిస్తున్న ఎంపీ అభ్యర్థి మల్లురవి, సంపత్ కుమార్, సరిత

ఎర్రవల్లి, మే 2 : దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కాంగ్రెస్‌తోనే సాధ్యమని, కేంద్రంలో అధికారంలోకి రాబోతుందని నాగర్‌కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి మల్లురవి అన్నారు. ఈ నెల ఐదున ఆదివారం ఎర్రవల్లి చౌరస్తాలోని రాజీవ్ గాంధీ ప్రాంగణంలో సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించ నున్న బహిరంగ సభకు లక్ష మంది జనం హాజరుకానున్నారని తెలిపారు. సభకు రాహుల్ గాంధీతో పాటు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. భారీ బహిరంగ సభ ఏర్పాట్లను గురువారం మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత పరిశీలించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బహిరంగ సభకు అలంపూర్, గద్వాల నియోజకవర్గాలతో పాటు వనపర్తి, కొల్లాపూర్ ప్రాంతాల నుంచి జన సమీకరణ చేస్తున్నట్లు తెలిపారు. సభను విజయవంతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. గట్టు ఎత్తిపోతల, నెట్టెంపాడు 99. 100 ప్యాకేజీ పనులతో పాటు తుమ్మిళ్ల మూడు రిజర్వాయర్ల నిర్మాణం తదితర ప్రధాన సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తామని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత తెలిపారు. రాహుల్‌గాంధీ ముందుగా హెలీక్యాప్టర్‌లో పదో బెటాలియన్‌కు చేరుకుంటారని, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సభాస్థలికి వస్తారని సంపత్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తిరుపతయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు జోగుల రవి, డీసీసీ కార్యదర్శి సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమానికి పెద్దపేట

- ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, మే 2: మైనారిటీల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ పెద్దపీట వేశారని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు తీసుకువచ్చారని గుర్తు చేశారు. గురువారం పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మైనారిటీ విభాగం కార్యకర్తలతో మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధి కోసం షాదీముబారక్, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు, హజ్‌హౌస్, అధికారికంగా రంజాన్ వేడుకలు, ఇమామ్ మౌజమ్‌లకు వేతనాలు, మసీదుల అభివృద్ధికి నిధులు, మైనారిటీ రుణాలు వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. ఎంపీ ఎన్నికలో మైనార్టీలు అంతా బీఆర్‌ఎస్‌కు అండగా నిలబడాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు బుద్ధిచెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సమావేశంలో మైనారిటీ నాయకులు అబ్దుల్ రహమాన్, మోసిన్, అహ్మద్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగ

- జడ్చర్లలో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత
- భరించలేని ఎండలతో జనం బేజారు



భానుడి ప్రతాపానికి నిర్మానుష్యంగా మారిన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా

మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూల్ టౌన్ /గద్వాల/ వనపర్తి అర్బన్, మే 2 : భానుడి ప్రతాపానికి జనం బేజారవుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎన్నడూలేని విధంగా ఉష్ణోగ్రత రోజురోజుకు పెరుగుతుండటంతో జనం ఎండవేడిమిని తట్టుకోలేకపోతున్నారు. రెండ్రోజులుగా జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 45 డిగ్రీలు దాటుతోంది. 45 దాటిందంటే రెడ్‌జోన్‌గా భావిస్తారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో జనం ఏం పనులు కూడా చేసుకోలేకపోతున్నారు. పనిచేయకపోతే పూటగడవని చాలామంది మండే ఎండలోనే పనులు చేసుకుంటున్నారు. బయటకు వెళ్లకుండా చాలామంది ఇళ్లకే పరిమితంఅవుతున్నారు. ఏసీలు ఉన్నవారు కరెంట్ బిల్లుల గురించి ఆలోచించకుండా ఎండ, ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు పగలు కూడా ఏసీలను వినియోగిస్తున్నారు.

గురువారం మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లలో 45.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. బాలానగర్‌లో 44.7. కౌకుంట్లలో 44.6, చిన్నచింతకుంటలో 44.5. కోయిల్‌కొండలో 44.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మిడ్జిల్, మహబూబ్‌నగర్ రూరల్‌లో 43.8, అడ్డాకులలో 43.7, దేవరకద్ర, నవాబ్‌పేటలలో 43.6, మహబూబ్‌నగర్‌లో 43.5, మూసాపేటలో 43.3, కోయిలకొండలో 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లిలో 44.8, అయిజలో 44.4, ఇటిక్యాల, అలంపూర్‌లో 44.2, ధరూర్‌లో 44.1, కేటీదొడ్డిలో 44, గద్వాలలో 43.9, రాజోలిలో 43.6, ఉండవెల్లిలో 43.3, మానవపాడులో 43, గట్టులో 42.9, మల్దకల్‌లో 42.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వనపర్తి జిల్లా మదనాపూర్ మండలంలో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఘనపూర్ 44.1, కొత్తకోట 44.0, పానగల్ 43.8, గోపాల్‌పేట 43.6, పెద్దమందడి 43.5, అమరచింత, శ్రీరంగాపూర్ 43.3, చిన్నంబావి 43.2, ఆత్మకూర్ 43.0, వనపర్తి 42.9, పెబ్బేరు 42.7, వీపనగండ్ల 42.3, రేవల్లి 41.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి, వెల్దండ, కోడేరులో 44.0, బిజినేపల్లిలో 43.6, చారకొండలో 43.4, పెద్దకొత్తపల్లిలో 43.2, నాగర్‌కర్నూల్‌లో 43.0, కొల్లాపూర్, ఉప్పునుంతలలో 42.9, పెంట్లవెల్లిలో 42.6, అచ్చంపేటలో 42.5, బల్మూరులో 42.2, తాడూరులో 42.1, లింగాలలో 41.5, ఉర్కొండలో 41.5, పదరలో 40.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నారాయణపేట జిల్లా కోస్గి, మక్తల్‌లో 42 డిగ్రీలు, నర్వలో 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకం



ఎన్నికల ప్రచారంలో భాగంగా పండ్ల వ్యాపారితో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

- పాలమూరులో పోటీ చేస్తున్నది వంశీచంద్ కాదు మీ రేవంత్‌రెడ్డి
- అహంకారంతో మాట్లాడేవారికి ఓటుతో బుద్ధి చెప్పాలి
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

కోస్గి రూరల్ మే 2: పాలమూరు స్థానం ఎంపీ ఎన్నికలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టకు సంబంధించిన ఎన్నిక అని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. గురువారం కోస్గి పట్టణంలో వ్యాపారులతో కలిసి ప్రచారం చేశారు. అనంతరం శివాజీ కూడలిలో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. పాలమూరులో ఎంపీగా పోటీచేస్తున్న వ్యక్తి వంశీచంద్‌కాదని, స్వయంగా మీ కొడంగల్ ముద్దుబిడ్డ రేవంత్‌రెడ్డి అనుకోవాలని అన్నారు. కొడంగల్ ప్రజలు ధర్మంవైపు ఓటు వేయాలని కోరారు. కొడంగల్‌కు సాగునీరు తెచ్చే కాంగ్రెస్‌కు ఓటు వేస్తారా లేక సారా కాంట్రాక్టర్లను పెంచి పోషించే వ్యక్తికి ఓటు వేస్తారో ఆలోచించుకోవాల న్నారు. కొడంగల్‌లో కళాశాలలు, ఫ్యాక్టరీలు తేవాలని వేలకోట్ల నిధులు కొడంగల్‌కు తీసుకువస్తున్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నా కొడంగల్ గోసపడ్డదని, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నది రేవంత్‌రెడ్డి కాదా అని అన్నారు. బీజేపీ నాయకులు గత అసెంబ్లీ ఎన్నికలలో తమ సొంత పార్టీ అభ్యర్థులను ఓడించడానికి తమ్ముడికి, అల్లుడికి మద్దతు ఇవ్వడానికి గద్వాలలో గొల్ల కురుమ అభ్యర్థిని మోసం చేసి మక్తల్‌లో ముదిరాజ్ బిడ్డను మోసం చేసేందుకు ప్రయత్నం చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు.

కొడంగల్‌లో చర్చకు రావాలని అహంకారంతో మాట్లాడుతున్న వారికి ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. జూన్ 4న వచ్చే ఫలితాలు వారి అహంకారానికి గుణపాఠం కావాలన్నారు. కార్యక్రమంలో కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ మెంబర్ విజయ్‌కుమార్, నాయకులు నరేందర్, బెజ్జురాములు, అన్నకిష్టప్ప, హరి తదితరులు ఉన్నారు.



ఈవీఎం యంత్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు రుచేస్‌జైవన్షీ

ఈవీఎం యంత్రాల పరిశీలన

నాగర్‌కర్నూల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అదనంగా కేటాయించిన ఈవీఎం యంత్రాలను ఎన్నికల సాధారణ పరిశీలకులు రుచేస్‌జైవన్షీ, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్‌లు పరిశీలించారు. గురువారం జిల్లాలో పార్లమెంటరీ ఎన్నికల నిర్వహణలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరుగుతున్న ఎలక్ట్రానిక్ యంత్రాలకు మొదటి లెవల్ చెకింగ్ ప్రక్రియను ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్, సాధారణ పరిశీలకులు రుచేస్‌జైవన్షీతో కలిసి పరిశీలించారు. ఈవీఎం, వీవీప్యాట్, బ్యాలెట్ బాక్సుల పనితీరును ఈసీఐఎల్ ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 19మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నందున పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణకు, రెండు బ్యాలెట్ యూనిట్లు అవసరం ఉన్నందున అదనపు ఈవీఎంలను సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈసీఐఎల్ ఇంజనీర్ల బృందం ఆధ్వర్యంలో ఫస్ట్‌లెవల్ చెకింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు అదనంగా బ్యాలెట్ యూనిట్లు 1300వచ్చాయని, వాటికి మొదటి లెవల్ చెకింగ్ చేయడం జరుగుతుందని, రెండు రోజుల్లో ఈవీఎంల తనిఖీ పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

ఎఫ్ఎల్‌సీ ముగిసిన వెంటనే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరును ప్రయోగాత్మకంగా పరిశీలించేందుకు వీలుగా ర్యాండం పద్ధతిన మాక్‌పోల్ నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తూ నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలని, ఓటింగ్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ సీతారామారావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఫలించిన కృషి

- పదిలో ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు కలెక్టర్ చొరవ
- గట్టు మండలంలో 40 రోజుల కార్యాచరణ విజయవంతం
- మండలంలో బాలికల గురుకులం టాప్

గట్టు, మే 2 : అక్షరాస్యతలో వెనుకబడిన గట్టు మండలంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు కలెక్టర్ బీఎం సంతోష్ చేసిన కృషి విజయవంతమైంది. గతేడాది పది ఫలితాల్లో గట్టు మండలం వెనుకబడటంతో ఆయన ఈ మండలంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉత్తమ ఫలితాల సాధన కోసం విద్యాశాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. విద్యాశాఖతో పాటు సంబంధిత అన్ని శాఖల అధికారులను భాగస్వాములను చేస్తూ 40 రోజుల ప్రత్యేక ప్రణాళికను రూపొందించి అమలు చేశారు. తల్లితండ్రులతో తరుచూ మాట్లాడుతూ విద్యార్థులు డ్రాప్ అవుట్ కాకుండా చర్యలు తీసుకున్నారు. గతేడాది ఉత్తీర్ణతా శాతం తక్కువగా ఉన్న చాగదోణ, మాచర్ల, ఇందువాసి, బోయలగూడెం, ఆలూరు పాఠశాలలను కలెక్టర్ స్వయంగా పరిశీలించి, అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. అవసరమైన బోధనా సిబ్బందిని అప్పటికప్పుడు నియమించారు. పాఠశాలలను సందర్శించి, విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ చర్యలతో ప్రభుత్వ పాఠశాలలతో పాటు, గట్టు బాలికల గురుకులం, మాచర్ల ఉన్నత పాఠశాల, బోయలగూడెం, ఇందువాసి పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. గతేడాది 25 శాతంతో పూర్తిగా వెనుకబడిన చాగదోణ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఈ ఏడాది 94 శాతం ఉత్తీర్ణతను సాధించడం విశేషం.

64 శాతం నుంచి 84 శాతానికి పెరిగిన ఉత్తీర్ణత

గతేడాది గట్టు మండలంలో పదో తరగతి ఉత్తీర్ణత శాతం 64 ఉన్నది. కలెక్టర్ బీఎం సంతోష్ తీసుకున్న ప్రణాళికతో ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం 84కు పెరిగింది. ఫిబ్రవరి 20న గట్టులో అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, డీఈవో, ఎంఈవోలతో పాటు అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉత్తీర్ణత శాతం పెంచడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాఠశాలల వారీగా హెచ్‌ఎంలకు వివరించారు. ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. కలెక్టర్ సూచనల ప్రకారం విద్యాశాఖ సిబ్బంది ప్రత్యేక కార్యాచరణ చర్యలు తీసుకోవడంతో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు రాబట్టారు.

ఉత్తీర్ణతా శాతాలు ఇలా..

గట్టు గురుకులంలో 98.77 శాతం ఉత్తీర్ణత సాధించగా, చాగదోణ 94.12 శాతం, గట్టు ఉన్నత పాఠశాల 54.17శాతం, ఇందువాసి 84.21శాతం, మాచర్ల 94.12 శాతం, ఆరగిద్ద ఉన్నత పాఠశాల 72.22, తప్పెట్లమోర్సు 62.86, బోయలగుడ్డం ఎంపీహెచ్‌ఎస్ 92.86, గొర్లఖాన్‌దొడ్డి ఎంపీహెచ్‌ఎస్ 78.57, కస్తూర్బాగాంధీ పాఠశాల 84.44, ఆలూరు ఉన్నత పాఠశాలలో 69.39 శాతం ఉత్తీర్ణత సాధించారు.



చాగదోణ పాఠశాలలో ఫిబ్రవరి 20వ తేదీన పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్ (ఫైల్)

కలెక్టర్ చొరవతో ఉత్తమ ఫలితాలు



గట్టు మండలంలో పదవతరగతిలో మెరుగైన ఫలితాలు రావడానికి కలెక్టర్ బీఎం సంతోష్ కృషి ఉన్నది. గట్టు మండలంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచడం వల్ల నేడు మండలంలో ఉత్తీర్ణత శాతం 84శాతానికి చెరుకున్నది. విద్యాశాఖ అధికారులనే కాకుండా అన్ని శాఖల అధికారులను భాగస్వామ్యం చేస్తూ ప్రణాళికతో ముందుకు సాగడం వల్ల ఈరోజు ఫలితాలను రాబట్ట గలిగాం. ఇందుకు కలెక్టరుకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

- నర్సింహులు, హెచ్‌ఎం మాచర్ల

మోదీ హయాంలోనే అభివృద్ధి

▸ కేంద్ర మంత్రి మురుగన్

వంగూరు మే 2: గత పది సంవత్సరాల పాలనలో ప్రధాని నరేంద్రమోదీ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలు దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాయని కేంద్ర ప్రసార, సమాచార శాఖ సహాయమంత్రి మురుగన్ అన్నారు. గురువారం మండలంలోని వంగూరు గేటు సమీపంలో ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశానికి మురుగన్‌తో పాటు నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు రాష్ట్రాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారన్నారు. బీ జేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌ను గెలిపిస్తే జిల్లా కేంద్రంలో రేడియో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఎంపీ రాములు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారం చేపడితేనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందన్నారు. మండలంలోని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు ఆనంద్‌రెడ్డి, సంజీవవరావుతో పాటు 50 మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారికి కేంద్ర మంత్రి మురుగన్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జగదీష్‌రెడ్డి, కొండల్ రెడ్డి, మంగ్యానాయక్ పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి సమక్షంలో బీజేపీలో చేరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మరికల్, మే 2 : మండంలోని తీలేరు గ్రామానికి చెందిన ఆవుల బాల్‌రాజ్ (40) నీమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఎస్ఐ మురళి కథనం ప్రకారం.. గత ఏప్రిల్ 27న మరికల్ నుంచి బైక్‌పై తీలేరుకు వెళ్తుండగా మహ బూబ్‌నగర్ నుంచి మరికల్‌కు వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో బాల్‌రాజ్‌కు తలకు తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నీమ్స్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య శారదతో పాటు ఇద్దరు ఆడ పిల్లలు, ఒక కొడుకు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

పెరుగుతున్న రోగులు.. తప్పని అవస్థలు



ఖిల్లాఘణపురం సీహెచ్‌సీలో ఒకే మంచంపై ఇద్దరు రోగులకు అందిస్తున్న వైద్య సేవలు

ఖిల్లాఘణపురం, మే 2 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి సామాజిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల నిమిత్తం రోజురోజుకు రోగుల సంఖ్య పెరగడంతో అవస్థలు తప్పడం లేదు. ప్రతీ రోజు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు సుమారు 200 మందికి ఓపీ సేవలను అందిస్తున్నారు. వేసవికాలంలో రోజురోజుకు ఉష్ణోగ్రత తీవ్రత పెరగడంతో వృద్ధులు, మహిళలు, ఉపాధి కూలీలు వడదెబ్బకు గురై ఆసుపత్రిలో చేరేవారి సంఖ్య పెరిగింది. వడదెబ్బకు గురైన రోగులను ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకొని గ్లూకోజ్ బాటిల్ పెడుతూ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. రోగులను అడ్మిట్ చేసుకుంటున్నా మంచాలు సరిపోకపోవడంతో ఒకే మంచంపై ఇద్దరిని ఉంచి సెలైన్లు ఎక్కిస్తున్నారు. ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో ఉన్న గదులు నిరుపయోగంగా మారాయి. ఆపరేషన్ థియేటర్, చిల్డ్రన్స్ వార్డ్‌లో పరికరాలు అలంకారప్రాయంగా మారాయి. ఆసుపత్రి భవనం పటిష్టంగా ఉన్నా రోగులకు నీటి సౌకర్యం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఆసుపత్రిలో నలుగురు డాక్టర్లు అందుబాటులో ఉన్నా సరైన వసతి, సదుపాయాలు లేవు. దీంతో 24 గంటల పాటు ఉండాల్సిన డాక్టర్ సైతం అందుబాటులో ఉండలేక పోతున్నారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు సరిపడా మంచాలను ఏర్పాటు చేసి, నీటి వసతి మెరుగుపరచాలని, 24 గంటల పాటు వైద్య సేవలు అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై సీహెచ్‌సీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చైతన్యను వివరణ కోరగా ఆసుపత్రిలో మంచాలను పెంచి రోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని అన్నారు. ఆస్పత్రిలో నీరు వాడుకోవడానికి భవ నంలోని పైప్‌లైన్లు జామ్ కావడంతో ఇబ్బందులు తలెత్తా యని, త్వరలో మర మ్మతులు చేపడుతామని అన్నారు. రోగులకు పూర్తిస్థాయి వైద్య సేవలను అందిం చడానికి సిబ్బందిని పెంచుతామని తెలిపారు.

నల్ల మట్టిని తోడేస్తున్నారు

▸ నాలుగు రోజులుగా తరలిస్తున్న మట్టి ▸ పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



నల్ల మట్టిని తరలిస్తున్న దృశ్యం



డంపు చేసిన నల్లమట్టి

గోపాల్‌పేట, మే 2 : మండలంలో పలు చోట్ల అక్రమార్కులు మట్టిదందా జోరుగా సాగిస్తున్నారు. మండలంలోని కత్వ చెరువు నీళ్ల లేక ఎండిపోయింది. ఇదే అదునుగా భావించిన ఇటుక బట్టి దళారి నాలుగు రోజులుగా ఐదు పెద్ద టిప్పర్‌లు, ఒక హిటాచీ సహాయంతో నల్లమట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వనపర్తి రోడ్డు పీఎంసీ మినీ ఫంక్షన్ హాల్ ఎదురుగా సుమారు 600 ట్రిప్పుల నల్లమట్టిని డంపింగ్ చేసుకున్నాడు. ఈ నల్ల మట్టిని రైతులు ఉచితంగా తమ పొలాల్లో వేసుకోవాలి. కానీ ఇటుక బట్టీల దళారీ చెరువు ఎండిన వెంటనే నాయకుల అధికారుల అండదండలతో ప్రతీ ఏటా లక్షల విలువ చేసే మట్టిని తరలిస్తున్నాడు. సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో ప్రజల నుంచి పలు అనుమానాలకు వ్యక్తం అవుతున్నాయి.

- ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాసులు వివరణ కోరగా నల్ల మట్టి కొడుతున్నట్లు మాకు ఎవరు సమాచారం ఇవ్వలేదని, పర్మిషన్ కూడా తీసుకోలేదని, ఎవరైనా నల్ల మట్టిని తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- నీటిపారుదల శాఖ ఏఈ వివరణ కోరగా మాకు మీ విలేకరుల ద్వారానే సమాచారం వచ్చిందని, తక్షణ మే మట్టిని తరలిస్తున్న వాహనాలను నిలిపివేసి మొదటి తప్పు కింద హెచ్చరించి వదిలేస్తామని తెలిపారు. ఇంకోసారి ఇలా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించామని తెలిపారు.



పోలీస్ స్టేషన్ ముందు వెళ్తున్న నల్లమట్టి లారీ

అధికారులు స్పందించడం లేదు..



దళారులు నాలుగు రోజులుగా మట్టి తరలిస్తున్నా- అధికారులు స్పందించడం లేదు. రైతులు మాత్రం మట్టి తరలిస్తుంటే ఎక్కడలేని సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు. అధికారులు స్పందించి ఇలాంటివి మళ్లీ పునరావృత్తం కాకుండా చూడాలని కోరుతున్నాము.

- మంగదొడ్డి బాలస్వామి

ఇసుక ట్రాక్టర్ బోల్తా

▸ యువకుడి తొడలోకి గుచ్చుకున్న చెట్టుకొమ్మ



ట్రాక్టర్ డ్రైవర్ మాలిక్ తొడలోకి గుచ్చుకున్న కొమ్మ

మానవపాడు, మే 2 : ఇసుక ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మాలిక్(28) తొడలోకి చెట్టుకొమ్మ గుచ్చుకున్న ఘటన గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని అమరవాయి గ్రామం వద్ద చోటుచేసుకున్నది. మండలంలోని మద్దూర్ గ్రామ శివారులోని తుంగభద్ర నది నుంచి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను గ్రామాలకు తరలిస్తుంటారు. ఈ క్రమంలో గురువారం మద్దూర్ గ్రామానికి చెందిన మాలిక్ ఇసుకను వేసుకొని అమరవాయి వైపు బయలుదేరాడు. ఈ తరుణంలో డంపింగ్ యార్డు సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. విషయాన్ని గమనించిన మాలిక్ ట్రాక్టర్‌పై నుంచి పక్కకు దూకడంతో పక్కనే ఉన్న చెట్టు మీద పడ్డాడు. చెట్టుకు కొమ్మలు ఉండటంతో తొడ భాగంలో ఓ వైపు నుంచి గుచ్చుకొని ఇంకోవైపు తేలింది. ఇది తమనించి అక్కడున్నవారు కొమ్మను తొలగించే ప్రయత్నం చేసినా సాధ్యంకాలేదు. మానవపాడులో తెలిసిన వారికి సమాచారం ఇచ్చారు. వారు యంత్రం సహాయంతో చెట్టు నుంచి కొమ్మను కోశారు. కానీ, తొడలో అలాగే ఉన్నది. ఈ క్రమంలో మాలిక్ రోదనలు అందరికీ కన్నీళ్లు తెప్పించాయి. వెంటనే మానవపాడు ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు కర్నూల్ ఆసుపత్రికి సిఫారసు చేశారు. ఆపరేషన్ చేస్తేకానీ కొమ్మను తొలగించే అవకాశంలేదు చివరికి కర్నూల్ ఆసుపత్రికి తరలించగా ఆపరేషన్ ద్వారా కొమ్మను తొలగించారు..

సిర్సనగండ్ల హుండీ ఆదాయం రూ.8,26,978



హుండీని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

చారకొండ, మే 2 : నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని సిర్సనగండ్లలోని అయోధ్యనగర్ (గుట్ట)లో రెండవ అపర భద్రాద్రిగా పేరుగాంచిన సీతారామచంద్రస్వామి ఆలయంలో ఏప్రిల్ 16 నుంచి 22 వరకు జరిగిన బ్రహోత్సవాల్లో భాగంగా ఆలయ హుండిని గురువారం లెక్కించారు. ఆలయ చైర్మన్ దేరం రామశర్మ, ఆలయ ఈవో స్వర్గం ఆంజనేయులు, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వీణధరి, మేనేజర్ నిరంజన్‌ల ఆధ్వర్యంలో సీతారామచంద్రస్వామి, పోచమ్మ, మైసమ్మ దేవాలయాల హుండీని లెక్కించారు. హుండీల ద్వారా ఆలయానికి రూ. 8,26,978, వెండి 300 గ్రాములు వచ్చినట్లు ఆలయ చైర్మన్ దేరం రామశర్మ తెలిపారు. 2023లో జరిగిన ఆదాయం కంటే రూ. 4,19,281 తక్కువగా వచ్చినట్లు తెలిపారు. ఎండల తీవ్ర ప్రభావం వల్ల భక్తులు తగ్గడంతో ఆదాయం తక్కువ వచ్చినట్లు ఆలయ చైర్మన్ తెలిపారు. ఆలయ పూజారులు దేరం మురళీదర్ శర్మ, దేరం లక్ష్మణశర్మ, దేరం కోదండరామశర్మ, దేరం వేణుశర్మ, దేరం ప్రవీన్‌శర్మ, దేరం గోపి శర్మ, ఆలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్సు, బైక్ ఢీ : వ్యక్తికి గాయాలు

గోపాల్‌పేట, మే 2 : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం తాడిపర్తి గ్రామంలో ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని బండమీద తండాకు చెందిన రవినాయక్ పనులు ముగించుకుని మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వనపర్తి నుంచి మండల కేంద్రానికి బైక్ వస్తున్నాడు. తాడిపత్రి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ముందు ఉన్న మలుపు వద్ద నాగర్‌కర్నూల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వనపర్తికి వెళ్తుండగా బైక్‌పై వేగం గా వచ్చిన రవినాయక్ ఢీకొన్నాడు. ప్రమాదంలో రవినాయక్ కుడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని 108లో వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు అతన్ని హైదరాబాద్‌కు తరలించారు. బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ ఆలస్యం

గద్వాల అర్బన్, మే 2 : కర్నూలు నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలు గురువారం ఆలస్యంగా గద్వాల స్టేషన్‌కు చేరడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. గద్వాల రైల్వేస్టేషన్‌కు సాయంత్రం నాలుగు గంటలకు రావాల్సి ఉండగా, 5.30 గంటలకు చేరుకున్నది. దాదాపు గంటన్నర పాటు ఆలస్యంగా రావడంతో స్టేషన్లో ప్రయాణికులు ఉక్కపోతతో అల్లాడిపోతూ ఎదురు చూడాల్సి వచ్చింది.

ప్రమాదవశాత్తు చెలరేగిన మంటలు

పాన్‌గల్, మే 2 : వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం కేతేపల్లి గ్రామంలోని ఊరబావి సమీపంలో వ్యవసాయ పొలాల్లోని వరి కొయ్యలకు నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. గ్రామస్థులు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊరబావి నుంచి రత్నారెడ్డి దొడ్డి వరకు ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మంటలు చెలరేగాయని, మంటలు వ్యాపించడంతో నీళ్లు చల్లి ఆర్పివేసినట్లు తెలిపారు. సకాలంలో స్పందించిన అంబేద్కర్ యువజన సంఘం సభ్యులను గ్రామస్థులు అభినందించారు.

తాగిన మైకంలో భార్యతో భర్త గొడవ, గొంతు కోసి హత్య



జ్యోతి(ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం, మే 2 : తాగిన మైకంలో భార్య జ్యోతి(35)తో గొడవ పడి భర్త బూసపాగ రాములు కత్తిపీటతో గొంతుకోసి పరారైన సంఘటన నాగర్‌కర్నూల్ మండలంలోని వనపట్ల గ్రామంలో చోటు చేసుకున్నట్లు సీఐ కనకయ్య గురువారం తెలిపారు. వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన బూసపాగ రాములు వనపట్ల గ్రామానికి చెందిన జ్యోతితో 16ఏళ్ల క్రితం వివాహమైంది. లేబర్ పని చేస్తున్న రాములు ఇంటి దగ్గర సరిగ్గా లేకుండా జులాయిగా తిరుగుతూ రెండు, మూడు నెలలకొకసారి ఇంటికి వచ్చేవాడని ఎస్ఐ పేర్కొన్నారు. ఇటీవల మూడు నెలలు బయట తిరిగి మూడు రోజుల క్రితం ఇంటికొచ్చిన రాములు గురువారం మద్యం తాగి భార్యతో గొడవపడి కత్తిపీటతో గొంతుకోసి హత్య చేసి పరారయ్యాడు. ఈ సంఘటన తెలుసుకున్న స్థానిక సీఐ కనకయ్య సంఘటన స్థలానికి చేరుకుని హత్య చేసిన వివరాలను సేకరించారు. రాములు లేబర్ పని చేస్తూ మరో మహిళతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్న విషయం భార్య జ్యోతికి తెలియడంతో భార్య నిలదీస్తే తరచూ భార్యతో గొడవపడేవాడని స్థానికుల కథనం ప్రకారంగా తెలిసింది. ఈ సంఘటనపై మృతురాలి అక్క అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కనకయ్య తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు హరికార్తీక్(15), అంజి(12) ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు?

భార్య జ్యోతి గొంతుకోసి పరారైన బూసపాగ రాములు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. తాగిన మైకంలో భార్యతో తరచూ గొడవపడుతున్న రాములు గురువారం కత్తిపీటతో గొంతుకోసి హత్య చేసి పరారయ్యాడు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తూ నిందితున్ని తమ అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

ఈ విషయంపై స్థానిక సీఐ కనకయ్యను వివరణ కోరగా నిందితుడు పరారీలో ఉన్నట్లు త్వరలో పట్టుకుంటామన్నారు.

ఎండకు మాడుతున్న కార్మికులు

▸ వేసవిలో అవస్థలు పడుతున్న మునిసిపల్ కార్మికులు

▸ పాలమూరులో 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత ▸ పని వేళల మార్పు కోసం సంఘం నాయకుల డిమాండ్

పాలమూరు, మే 2 : వేసవికాలం కావటంతో ఎండలు మండిపోతున్నాయి. ఇప్పటికే పాలమూరు పట్టణంలో ఉష్ణోగ్రత 44 డిగ్రీలు దాటింది. వేడిమికి మునిసిపల్ కార్మికులు శానిటేషన్, ఊడ్చటం, మురికి కాలువలు తీయటం వల్ల ఎండలకు, వడదెబ్బకు గురవుతున్నారు. చల్లటిపూట మాత్రమే పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని వివిధ మునిసిపల్ కార్మిక సంఘాల ప్రతినిధి బృందం మునిసిపల్ కమిషనర్‌ను కలిసి పరిస్థితిని వివరించాయి. ప్రతీ ఏడాది వేసవి కాలం ఎండలు పెరిగిన సమయంలో ఉదయం పూట మాత్రమే పని చేయించే విధంగా విధులు కేటాయించేవారని నాయకులు చెబుతున్నారు. ఈ ఏడాది ఎన్నికల కోడ్ రావటంతో కార్మికులచేత మధ్యాహ్నం రెండు గంటల వరకు పని చేయిస్తున్నారని వారు అంటున్నారు. రాష్ట్రంలోని ఖమ్మం, నిజామాబాద్, మెదక్ జిల్లాలతో పాటు కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికే ఉదయం పూట విధులు కేటా యించిన విషయాన్ని నాయకులు గుర్తు చేశారు. అక్కడక్కడా ఎండ తీవ్రతకు కార్మికులు సొమ్మసిల్లి పడిపోతున్నారని, ఉదయం 4.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని సంఘాల నాయకులు కోరుతున్నారు.



ఎండలో విధులు నిర్వహిస్తున్న మునిసిపల్ కార్మికులు

పై అధికారులతో చర్చించి నిర్ణయిస్తాం

మునిసిపల్ కార్మికులు ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్దేశిత సమయా ల్లోనే పని చేయాలి. మధ్యాహ్నం విరామం తీసుకోవాలి. వేసవికాలం రెండు పూటలా ఎందుకని వరుసగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పనిచేసి ఇం టికి వెళ్లిపోతున్నారు. కార్మికులు అందరు సమన్వయంతో పని చేసుకుంటున్నా రు. పని వేళల విషయంపై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంట.

- మహేశ్వర్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్

పొద్దునపూట పని చేయించాలి



పూర్తిగా పగటిపూట రోడ్డుపైన పని చేయటంతో రాత్రికి వేడిచేస్తోంది. ఇంటికి వెళ్లినంక ఏమి తినాలి పించటంలేదు. ఎండాకలమంతా ఇదేపద్ధతిలో పని చేస్తే ఆసుపత్రి పాలవటం ఖాయం. అందుకని పొద్దునపూట పనిచేయిస్తే అందరికీ బావుంటుంది.

- తారాసింగ్, మునిసిపల్ కార్మికుడు

మా ఆరోగ్యం బాధ్యత ఎవరిది



అధికారుల మాట మీద ప్రతీదినం ఎండలోనే పనిచేస్తే మేము ఆసుపత్రిపాలైతే ఎవరిది బాధ్యత. అధికారులు మాత్రం నల్లగ నీడ పాటున ఉండి పని చేసి ఆరోగ్యంగా ఉంటున్నారు. మేము మాత్రం ఎర్రటి ఎండలో ఎలా పని చేయాలి.

- శివకుమార్, మునిసిపల్ కార్మికుడు

రేపు కొత్తకోటలో సీఎం కార్నర్ మీటింగ్

▸ సభాస్థలి, హెలిప్యాడ్ స్థలాలను పరిశీలించిన ఎస్పీ



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ రక్షిత కె.మూర్తి

కొత్తకోట, మే 2 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 4వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి వనపర్తి జిల్లా కొత్తకోటలో నిర్వహించనున్న కార్నర్ మీటింగ్‌లో పాల్గొననున్నారు. సీఎం పర్యటనను పురస్కరించుకొని గురువారం ఎస్పీ రక్షిత కె.మూర్తి హెలిప్యాడ్, సభా స్థలాలను పరిశీలించారు. వీఐపీ వాహనాల పార్కింగ్, మీటింగ్‌కు వచ్చే వాహనాల పార్కింగ్‌లతో పాటు, ట్రాఫిక్ మళ్లింపు, తీసుకునే చర్యలపై అధికారులతో సమాలోచనలు చేశారు. అలాగే బందోబస్తు పరంగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ (ఏఆర్) వీరారెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీఐ రాంబాబు, అప్పలనాయుడు, ఎస్సై మంజునాథ్‌రెడ్డి ఉన్నారు.

ఇసుక డంపుల పరిశీలన

మిడ్జిల్, మే 2 : మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో వాగు పరిసర ప్రాంతంలో నిల్వ చేసి ఉన్న ఇసుక డంపులను గురువారం జిల్లా మైనింగ్ రాయల్టర్ రాజారెడ్డి, సర్వేయర్ సుజాతలు పరిశీలించి కొలతలు చేపట్టారు. ఇసుక కొలతల అనంతరం పూర్తి స్థాయి నివేదికను జిల్లా అధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఆర్ఐ అంబిక, టీఎస్ఎండీసీ అధికారులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిడ్జిల్, మే 2 : మండలంలోని వాడియాల గ్రామ శివారులోని దుందుభీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆనంద్ గురువారం తెలిపారు. వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం రావడంతో వెంటనే వాగు వద్దకు తమ సిబ్బంది వెళ్లగా ఇసుకతో నిండిఉన్న ట్రాక్టర్ కనిపించగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సీపెట్ డిప్లొమా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పాలమూరు, మే 2 : సీపెట్ డిప్లొమా ప్రోగ్రాంలకు కామన్ అడ్మిషన్ టెస్టుకు దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని సీపెట్ ట్రెయినింగ్ ఇన్‌చార్జి/మేనేజర్ అంజేయశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్, టెక్నాలజీ (సీపెట్-హైదరాబాద్)భారత ప్రభుత్వ రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉన్నత, సాంకేతిక విద్యకు ఒక ప్రధాన విద్యాసంస్థ, తెలంగాణ రాష్ట్రంలో ప్లాస్టిక్, అనుబంధ పరిశ్రమలకు శిక్షణ, సాంకేతిక సేవలను అందించడానికి 1987లో ఈ కేంద్రం స్థాపించినట్లు తెలిపారు. క్యాడ్/క్యామ్/సీఏఈ, టూలింగ్, డిజైన్, మాన్యుఫాక్చరింగ్, ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్, టెస్టింగ్ అండ్ క్వాలిటీ అస్యూరెన్స్ విభాగాల్లో అత్యాధునిక మౌలిక సదుపాయాలు ఈ కేంద్రంలో ఉన్నాయని తెలిపారు. బీఎస్సీ విద్యార్థులకు పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ కోర్సును టెన్త్ విద్యార్థులకు డిప్లొమా ప్రోగ్రామ్స్ ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ అండ్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ కోర్సును అందిస్తోందన్నారు. సీపెట్ వెబ్‌సైట్‌ను సందర్శించటంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. దరఖాస్తుల సమర్పణకు చివరితేదీ సమీపిస్తోందన్నారు. కామన్ అడ్మిషన్ టెస్ట్ జూన్9, 2024 జరుగుతుందన్నారు.వివరాలకు 94948 44571 సంప్రదించాలని తెలిపారు.

బాలిక అదృశ్యం : కేసు నమోదు

మిడ్జిల్, మే 2 : మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (15) అదృశ్యమైనట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు. బాలిక ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామన్నారు.

అమ్రాబాద్ మండలంలో మరొకరు..

అమ్రాబాద్, మే 2: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక (ఇంటర్ ఫస్టియర్) అదృశ్యమైనట్లు అమ్రాబాద్ ఎస్ఐ రమేష్ విలేకరులకు తెలిపారు. గురువారం తెల్లవారుజామున ఇంటి నుంచి బాలిక కనిపించకుండా పోయిందని తల్లిదండ్రులు అమ్రాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన ఓ యువకుడిపై తమకు అనుమానం ఉందని, ఆ యువకుడు గతంలో సోషల్ మీడియాలో చేసిన పోస్టులపై బాలిక తల్లిదండ్రులు మందలించి ఆ గ్రామంలోనే పెద్దమనుషుల సమక్షంలో కూడా మాట్లాడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ వెల్లడించారు. బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం పట్టివేత

మక్తల్, మే 2 : టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడుల్లో రూ.7,680 విలువైన మద్యం పట్టుకున్నట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. తాళంకేరికి చెందిన నర్సిములు మద్యం తరలిస్తుండగా మక్తల్ శివారులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి 31.200 లీటర్ల మద్యం పట్టుకొని స్టేషన్‌లో అప్పగించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమంగా మద్యం తరలించినా లేక రూ.50వేలకు మించి నగదు తరలించినా కఠిన చర్యలు తప్పవన్నారు.

పుల్లూరు శివారులో..

అలంపూర్ చౌరస్తా, మే 2 : మండల పరిధిలోని పుల్లూరు శివారులో జాతీయ రహదారిపై సరిహద్దు మీదుగా అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు అలంపూర్ ఎస్ఐ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. కర్నూలు జిల్లా మామిడాలపాడు గ్రామానికి చెందిన మద్దయ్య అనే చిరువ్యాపారి తెలంగాణలో మద్యం కొనుగోలు చేసి తీసుకెళ్తూ, పోలీసుల తనిఖీల్లో పట్టుబడినట్లు చెప్పారు. అతడి నుంచి రూ.8,640 విలువైన తొమ్మిది లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఆటో బోల్తా : ఒకరి మృతి

కల్వకుర్తి, మే 2 : ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్ఐ జి.మాధవరెడ్డి కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన బాలస్వామి(50) కల్వకుర్తి నుంచి రంగాపూర్‌కు ఆటోలో బయల్దేరాడు. కల్వకుర్తి పట్టణ పరిధిలోని కైలాస గుట్ట సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బాలస్వామి మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు.

అదృశ్యమైన వృద్ధురాలి మృతి

మిడ్జిల్, మే 2 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలో అదృశ్యమైన వృద్ధురాలు మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రమోహన్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కావేరమ్మపేటకు చెందిన నాగమ్మ బుధవారం నుంచి కనిపించడం లేదని ఆమె కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదుచేయగా గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నాగమ్మకు కల్లు తాగే అలవాటుందని, బుధవారం ఉదయం కొంచెం పిచ్చిగా ప్రవర్తించిందని, తర్వాత మూడు గంటల నుంచి కనిపించకుండా పోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్ఐ తెలిపారు. గురువారం తొమ్మిది గంటల సమయంలో కాలనీకి చెందిన వెంకటేష్ కావేరమ్మపేట చెరువులో మహిళ మృతదేహం ఉందని తెలియజేయడంతో వెంటనే అక్కడికి వెళ్లి చూడగా తన తల్లి మృతదేహంగా గుర్తించి ఆంజనేయులు తమకు ఫిర్యాదు చేశాడని తెలిపారు. వెంటనే కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి బైండోవర్



తహసీల్దార్ ముందు వ్యక్తిని బైండోవర్ చేస్తున్న పోలీసులు

హన్వాడ, మే 2 : మండలంలోని వేపూర్ గ్రామానికి చెందిన ప్రకాశ్‌కుమార్‌ను గురువారం పోలీసులు తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి గొడవలు సృష్టించకుండా ముందస్తుగా బైండోవర్ చేశారని తహసీల్దార్ కిష్టానాయక్ తెలిపారు. మరో సారి ఎలాంటి గొడవలకు పాల్పడవద్దని, పాల్పడితే లక్ష రూపాయల జరిమానా తప్పదని హెచ్చరించి పూచీకత్తుపై వదిలేశారు.

ఇటాచీని లారీపైకి ఎక్కిస్తుండగా తప్పిన ప్రమాదం



లారీపైకి ఎక్కిస్తుండగా టాటా ఏసీపై పడిన ఇటాచి

అచ్చంపేటటౌన్, మే 2: పట్టణంలోని ఓం చౌరస్తా వద్ద ఇటాచీని లారీపైకి ఎక్కిస్తుండగా అదుపుతప్పి లారీ నుంచి కిందకు జారిన సంఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది. ఇటాచీని లారీపైకి ఎక్కించే క్రమంలో అదుపు తప్పడంతో కొంత భాగం రోడ్డుపైకి వచ్చేసింది. మట్టితీసే బొకెన ఒక్కసారిగా రోడ్డుపై వెళుతున్న టాటా ఏసీ వాహనానికి తగలడంతో ఆగిపోయింది. టాటా ఏసీని రావొద్దని స్థానికులు వారిస్తున్నా ఒక్కసారి దూసుకురావడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. పూర్తిస్థాయిలో ఇటాచీ బొకెన టాటాఏసీ వాహనంపై పడిఉంటే అందులో వెళ్లేవారు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి. ఈ సంఘటనతో పాత బస్టాండ్‌లో దాదాపు గంటకు పైగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ



మంచాలకట్టకు వెళ్లే దారిలో లీకేజీ అవుతున్న మిషన్ భగీరథ నీళ్లు

పెంట్లవెల్లి, మే 2 : మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామానికి వెళ్లే దారిలో గత నెలరోజులుగా మిషన్ భగీరథ నీళ్లు లీకవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వేసవికాలంలో మల్లేశ్వరం, మంచాలకట్ట గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడి ప్రజలు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. అరకొరగా వదిలిన నీళ్లు ట్యాంకులకు చేరకుండా చాలా వరకు ఇనుప పైపులు లీకేజీ అవ్వడంతో రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వృథాగా పోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నేడు, రేపు హోం ఓటింగ్

- ఆర్డీవో ఎస్.శ్రీను

కల్వకుర్తి, మే 2 : కల్వకుర్తి నియోజకవర్గంలో హోం ఓటింగ్‌కు ఫామ్-12డీ దరఖాస్తులు ఇచ్చిన 88మంది ఓటర్లు శుక్ర, శనివారాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కల్వకుర్తి ఆర్డీవో, ఏఆర్వో ఎస్.శ్రీను కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ అధికారులు ఓటర్ల ఇంటి వద్దకు వస్తారని ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. మొదటి రోజు అందుబాటులో లేనివారు రెండవ రోజు శనివారం కచ్చితంగా ఓటును వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. లేకుంటే పోలింగ్‌బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం ఉండదని ఆర్డీవో తెలిపారు. అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు శుక్రవారం నుంచి ఈనెల 8వరకు వినియోగించుకోవాలని కోరారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేజీబీవీ విద్యార్థిని అభినందించిన కలెక్టర్



కేజీబీవీ విద్యార్థిని వరలక్ష్మిని అభినందిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

చారకొండ, మే 2: మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థిని పగిళ్ల వరలక్ష్మి ఇంగ్లీష్ మీడియంలో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 9,7 జీపీఏ సాధించి జిల్లాలోని కేజీబీవీ పాఠశాల్లోనే జిల్లా రెండవ స్థానంలో నిలవడంతో గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఉదయ్‌కుమార్ విద్యార్థిని పగిళ్ల వరలక్ష్మిని సన్మానించి, ప్రశంసా పత్రం అందించి అభినందించారు. విద్యార్థిని వెంట కేజీబీవీ ఎస్‌వో మంజుల, టీచర్లు ఉన్నారు.

ఇంటర్ విద్యార్థినికి సన్మానం

లింగాల: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివి జిల్లా టాపర్‌గా నిలిచిన మండల పరిధిలోని బాషమోని సింధూను గురువారం జిల్లా కేంద్రంలో ఘనంగా సన్మానించారు. బైపీసీ చదువుతున్న విద్యార్థి 1000 మార్కులకు గాను 944 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలువడం పట్ల కలెక్టర్‌తో పాటు డీఈవో గోవిందురాజులు అభినందించారు. కార్పొరేట్ కళాశాలల తరహాలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల యందు మెరుగైన విద్య అందుతుందని కలెక్టర్ అన్నారు. విద్యార్థిని జిల్లా టాపర్‌గా నిలబెట్టిన విద్యాలయం ఎస్‌వో శారద కృషి అభినందనీయమని అన్నారు.

మంగనూర్‌లో వైద్య శిబిరం విజయవంతం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఆయూష్ వైద్యాధికారి డాక్టర్ మేఘనా రెడ్డి

బిజినేపల్లి, మే 2: లట్టుపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం మంగనూర్‌లో చేపట్టిన ప్రత్యేక వైద్య శిబిరం విజయవంతమైనట్లు ఆయూష్ వైద్యాధికారి డాక్టర్ మేఘనా రెడ్డి తెలిపారు. ప్రస్తుతం వేసవి సీజన్‌లో సూర్యతాపాన్ని తట్టుకునేందుకు అవసరమైన ఆరోగ్య జాగ్రత్తలు ప్రతీ ఒక్కరు తీసుకోవాలని అన్నారు. ప్రతీ రోజు పెద్దలు మంచినీటిని 15 నుంచి 17 గ్లాసులు, పిల్లలు 9 నుంచి 11 గ్లాసుల తాగునీరు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఇంట్లో నుంచి వివిధ పనుల కోసం బయటకు వెళ్తే 11:30 గంటల లోపు ముగించుకొని ఇంటికి చేరుకోవాలన్నారు. దీర్ఘకాలిక రోగులకు, చర్మ, అలర్జీ సంబంధ వ్యాధిగ్రస్తులను పరీక్షించి మందులు అందజేసినట్లు తెలిపారు. ఆయూష్ ఫార్మసిస్ట్ దివ్య, ఆరోగ్య కార్యకర్త టీ యాదగిరి, ఆశ కార్యకర్తలు బాలమణి, అనిత, నాగమ్మ తదితరులు ఉన్నారు.

వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నాగర్‌కర్నూల్ టౌన్, మే 2: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాట్స్) ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడాకారులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఏవో చంద్రశేఖర్ చేతుల మీదుగా వ్యాయామ ఉపాధ్యాయులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 10 గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 31 వరకు వేసవి క్రీడా శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ శిబిరాలను గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలపై ఆసక్తి కలిగిన క్రీడాకారులు శిక్షణ తీసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి వి.సీతారం, కార్యాలయ సిబ్బంది అమరేశ్వర్‌రావు, ఎం.స్వామి, వ్యాయామ ఉపాధ్యాయులు టి.కుమారస్వామి, సి.కుర్మయ్య, డి.రామకృష్ణ, రాణ మల్లేష్, జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ

తిమ్మాజిపేట, మే 2 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాసులు తిమ్మాజిపేట మండలంలో గుర్తించిన ఐదు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గురువారం సీఐ కనకయ్యగౌడ్ స్థానిక ఎస్‌ఐ నరేందర్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆవంచ, నేరేళ్లపల్లి, పోతిరెడ్డిపల్లి, బావాజీపల్లి, గొరిట గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి పరిసరాలను పరిశీలించి స్థానికులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

కాంగ్రెస్‌లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడి చేరిక



ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు యార రమేష్, అనుచరులు

తాడూరు, మే 2 : బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన రెండు పర్యాయాల పాటు మండల అధ్యక్షుడిగా ఉన్న యార రమేష్ గురువారం ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవిల ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ స్వగృహంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతోపాటు వారి అనుచరులు దాదాపు 200మంది వరకు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా యార రమేష్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎంపీ అభ్యర్థి మల్లురవి గెలుపు కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.

బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలే ఆర్‌ఎస్పీని గెలిపిస్తాయి

- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



నడింపల్లిలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

అచ్చంపేట, మే 2: గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలే ఆర్‌ఎస్పీని గెలిపిస్తాయని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌ను గెలిపించాలని గురువారం పట్టణంలోని 10వ వార్డుతో పాటు, మండల పరిధిలోని నడింపల్లి గ్రామంలో ఉపాధిహామీ కూలీలను కలిసి మాట్లాడారు. గతంలో బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. నాయకులు శివ, రమేష్‌రావు, బాలరాజు, శంకర్, శ్రీశైలం, అశోక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్థిరత్వం లేని ఆర్‌ఎస్పీ రాజకీయ ప్రయాణం

- మంత్రి జూపల్లి కృష్ణారావు



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

ఉప్పునుంతల, మే 2: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై గతంలో తిట్టని తిట్టు తిట్టకుండా తిట్టిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కేసీఆర్ పంచనచేరి స్థిరత్వం లేని రాజకీయాలు చేస్తున్నాడని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండల కేంద్రమైన ఉప్పునుంతలతో పాటు, మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ రోడ్‌షో నిర్వహించారు. మండల పరిధిలోని ఊర్కొండనిపల్లి, వెల్టూరు గ్రామాల్లో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి ప్రచారంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఎంపీగా గెలిచిన పోతుగంటి రాములు పాలమూర్ జిల్లా గురించి పార్లమెంట్‌లో మాట్లాడారా అని విమ్మరించారు. 60 ఏళ్ల తరువాత పాలమూరు బిడ్డకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం వచ్చిందని, ఆయనకు మద్దతుగా ప్రతీ పాలమూరు బిడ్డ నిలవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలంటే కేంద్రంలో రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయాలనే ఏకైక లక్ష్యంతో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవిని లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలు ఓట్లు అడిగే నైతిక హక్కు కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలల కాలం లోనే ఆరు గ్యారెంటీల లో ఐదు గ్యారెంటీలు అమలు చే యడం జరిగిదన్నారు. ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని ఆయన అన్నారు. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేసి పార్లమెంట్ ఎన్ని కల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవిని గెలిపించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. రాష్ట్ర నాయకుడు మోపతయ్య, జడ్పీటీసీ సభ్యుడు అనంతాప్రతాప్‌రెడ్డి, నాయకులు అనంతరెడ్డి, నర్సింహారెడ్డి, మల్లేష్, రఘుపతిరెడ్డి, రమేష్‌రెడ్డి ఉన్నారు.

కేంద్రంలో బీజేపీదే అధికారం

- బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్



రోడ్‌షోలో మాట్లాడుతున్న భరత్‌ప్రసాద్

పెద్దకొత్తపల్లి, మే 2 : కేంద్రంలో మరొకసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ అన్నారు. ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండల పరిధిలోని చంద్రకల్, ముష్టిపల్లి, మరికల్, పెద్దకార్పాముల, దేవునితిర్మలాపూర్ గ్రామాల్లో రోడ్‌షో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమగ్రత కోసం కృషి చేస్తున్న మోదీని మూడవసారి ప్రధానిని చేసేందుకు ఈ ఎన్నికలు ప్రధానమైనవన్నారు. మోదీ పదేళ్ల పాలనలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ సందర్భంగా పెద్దకార్పాములకు చెందిన శ్రీలేఖ అనే బాలిక బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌కు తాను దాచుకున్న 370రూపాయల గల్లడబ్బీని ఎన్నికల ప్రచార ఫండ్‌గా అందజేసింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జలాల శివుడు, బీజేపీ మండల అధ్యక్షుడు పదిర భీమేష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గువ్వలి వెంకటయ్య, నాయకులు తిరుమల్ యాదవ్, ప్రవీణ్‌కుమార్‌యాదవ్, శేఖర్‌యాదవ్, నాగరా జుయాదవ్, ఎల్లేని కృష్ణారావు, మార్కండేయ, అమ్మపల్లి మల్లేష్ పాల్గొన్నారు.

మోదీ ప్రధానిగా ఉంటేనే దేశం సురక్షితం

● కోడేరు: నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా ఉంటేనే దేశం సురక్షితంగా ఉంటుందని నాగర్‌కర్నూల్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. గురువారం మధ్యాహ్నం పార్లమెంట్ ఎన్నికల విజయ సంకల్ప యాత్రలో భాగంగా కోడేరు మండలంలోని కొండ్రావుపల్లి, జనుంపల్లి, తీగలపల్లి, మైలారం తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ మాట్లాడారు. బీజేపీ మండల అధ్యక్షుడు పుల్లయ్య, కార్యదర్శి బాలపీరు, యువ మోర్చా నాయకులు రామకృష్ణ, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి

నాగర్‌కర్నూల్ టౌన్, మే 2: జిల్లా కేంద్రంలోని హిమాలయ హోటల్‌లో బుధవారం రాత్రి ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమావేశానికి నాగర్‌కర్నూల్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లు రవితో పాటు స్థానిక ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో ఉందన్నారు. అందులో భాగంగానే ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. ఆర్యవైశ్యులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తనను నేరుగా సంప్రదిస్తే అండగా ఉంటానన్నారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఆర్యవైశ్యులంతా ఐక్యంగా ఉండి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవిని ఆదరించాలని ఆయన కోరారు. ఆర్యవైశ్య ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోసపోయి గోస పడుతున్నాం

-మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి



లింగసానిపల్లిలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

బిజినేపల్లి, మే 2 : అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పిన మాయ మాటలు ప్రజలు నమ్మి ఓట్లు వేశారని, దీని ఫలితంగా మోసపోయి గోస పడుతున్నామని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. మండలంలోని లింగసానిపల్లి, వసంతాపూర్, గంగారం, లట్టుపల్లి, మంగనూర్ గ్రామాల్లో గురువారం బీఆర్‌ఎస్ పార్లమెంటు అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించి ఉపాధి హామీ కూలీలను ఉద్దేశించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తానని, రూ.2 లక్షల రుణమాఫీ డిసెంబర్ 9న చేస్తానని అలవి కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఏ ఒక్క హామీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేశాడని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దిగిపోయి నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వ నాయకులపై తీవ్ర వ్యతిరేకత ప్రజల్లో వ్యక్తం అవుతుందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఇంటి పార్టీ అని బీజేపీ, కాంగ్రెస్ పా ర్టీలు విసిటింగ్ పార్టీలని ప్రజలు గుర్తించి మరోసారి మాయమాటలు నమ్మి తప్పుడు నిర్ణయం తీసుకోకుండా కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీలు తిరుపతి రెడ్డి, రాధా తిరుపతి రెడ్డి, గౌతమ్ శ్రీను, మాధవరెడ్డి, పులేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గోవర్దన్ రెడ్డి, అల్లోజీ, శేఖర్‌రావు, మహేష్ రావు, వినయ్ రావు ఉన్నారు.

ఆన్‌లైన్ క్లాస్‌లతో అందరివాడయ్యాడు

- పేద విద్యార్థులకు అండగా నిలిచిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు

- ఆన్‌లైన్ క్లాసుల ద్వారా 200మందికి పైగా గురుకుల సీట్లు



ఉపాధ్యాయుడ్ని సన్మానించిన గ్రామస్థులు (ఫైల్)

అచ్చంపేటటౌన్, మే 2: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు అండగా నిలిచాడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు గాజుల వెంకటేష్. ఆయన ఆన్‌లైన్ క్లాసులు స్థాపించి పేద విద్యార్థులకు ఉచితంగా క్లాసులు చెప్పడం ద్వారా దాదాపు 200కు పైగా విద్యార్థులు గురుకుల సీట్లు సాధించారు. గురుకులంలో సీటు సాధించాలన్న కల నేరవేర్చేందుకు పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు భారత్ విద్యా ఉద్యమంను 2020 స్థాపించారు. ఆయనతో పాటు ఆయన సతీమణి కల్మల భౌతిక డిగ్రీ, డీఈడీ పూర్తి చేసి పేద విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా క్లాసులు చెబుతూ సహాయం చేసింది.

ఉప్పునుంతల మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో వెంకటేష్ విధులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు ఆన్‌లైన్ ద్వారా పాఠాలు చెబుతూ అండగా నిలుస్తున్నారు. ఇటీవల 5వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్ష 2024 కోసం మైక్రోసాఫ్ట్ టీమ్స్ యాప్ ద్వారా 35రోజులు ఉదయం, సాయంత్రం ఉచిత ఆన్‌లైన్ తరగతులు నిర్వహించారు. అదేవిధంగా రికార్డు చేసిన వీడియో పాఠాలను యూట్యూబ్‌లో ఉంచడం ద్వారా ఎంతో మంది విద్యార్థులకు సహాయపడింది. ఈ వీడియో లింకులను వాట్సాప్ గ్రూప్‌లలో షేర్ చేయడం ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఉపాధ్యాయులు, వివిధ జిల్లాల వారు వీడియో లింకులను వారి పాఠశాల, గ్రామాల్లో వాట్సాప్ గ్రూప్‌లలో షేర్ చేయడం ద్వారా రాష్ట్రంలోని ఎంతో మంది విద్యార్థులకు ఉపయోగపడింది. గురుకుల ప్రవేశ పరీక్ష ద్వారా దాదాపు 200పైగా గురుకుల సీట్లు సాధించడం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు విద్యావంతులు ఆ ఉపాధ్యాయుడిని అభినందించారు.

● గురుకులంలో సీటు సాధించా



మా సర్ మా నాన్న ఫోన్‌కు యాప్ పంపించారు. మా నాన్న ఫోన్‌లో సార్ చెప్పిన పాఠాలు విన్నాను. 5వ తరగతి గురుకుల పరీక్షలు రాశాను. వెల్టూరు బీసీ గురుకుల పాఠశాలలో సీటు వచ్చింది. ఉదయం సాయంత్రం సమయంలో ఆన్‌లైన్ పాఠాలు, మేడం, సార్ చెప్పేవారు. సీటు రావడం మా అమ్మనాన్నలకు చాలా సంతోషంగా ఉంది.

- చిథారి సాన్విక- తిమ్మరాసిపల్లి, కల్వకుర్తి

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

కల్వకుర్తి, మే 2 : నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా బీజేపీ నాయకులు కల్వకుర్తిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నీరుకంటి రాఘవేందర్‌గౌడ్, పలువురు బీజేపీ నాయకులు పట్టణంలోని 12వ వార్డులో ఓట్లను అభ్యర్థించారు. దేశంలో మోదీతోనే సుస్థిర పాలన సాధ్యమని పేర్కొన్నారు. బీజేపీని గెలిపించి ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పాటునందించాలని రాఘవేందర్‌గౌడ్ కోరారు. బీజేపీ నాయకులు గంగాధర్, రాజుసాగర్, శ్రీకాంత్, బాలకృష్ణ, గణేష్, నరేష్, సాయి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

● లింగాల: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్‌కు మద్దతుగా గురువారం మండల బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా నాయకుడు వెంకటశెట్టి అధ్వర్యంలో మండల నాయకులు శాయిన్‌పేట తదితర గ్రామాల్లో పర్యటించి బీజేపీ అభ్యర్థిని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సలేశ్వరం, నవీన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

● తెలకపల్లి: బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం ఇంటింటి ప్రచారంలో భాగంగా తెలకపల్లి మండల కేంద్రంలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కట్ట సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే నరేంద్రమోదీ మూడవసారి ప్రధానమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. దేశం కోసం నరేంద్రమోదీకి, బీజేపీకి ఓటు వేయాలని ఆయన కోరారు. జిల్లా అధికార ప్రతినిధి కొత్తపల్లి రవికుమార్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గుండూరు రాముడు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గోపాస్ చందు, బూత్ అధ్యక్షుడు భాషమోని శివ, ఆజాద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

‘బీజేపీ ద్వారానే దేశ రక్షణ’

తిమ్మాజిపేట, మే 2 : బీజేపీ పాలన ద్వారానే దేశానికి రక్షణ లభిస్తుందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలని రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి దిలీపాచారి పిలుపునిచ్చారు. తిమ్మాజిపేట మండలంలోని పోతిరెడ్డిపల్లి, గొరిట గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి ఆయా గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్నర్ సమావేశంలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షుడు ముద్దం యశ్వంత్, బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, రాజావర్ధన్‌రెడ్డి, గోసుల బాలయ్య, బాల్‌రెడ్డి, దాచేపల్లి వేణుగోపాల్, దాచేపల్లి ప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, జాకీర్‌హుసేన్, జెట్టి వెంకటేష్, నాగేందర్‌గౌడ్, శివయాదవ్, శివకుమార్, లింగ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం

పెద్దకొత్తపల్లి, మే 2 : మండల పరిధిలోని పెద్దకార్పాముల గ్రామంలో ఎలమోని ఈశ్వరమ్మ ఇటీవల మృతి చెందింది. గురువారం దశదినకర్మ సందర్భంగా కుటుంబ సభ్యులకు మండల కౌండిన్యదళ కమిటీ సభ్యులు 10వేల రూపాయ లను ఆర్థిక సహాయంగా అందజేశారు. మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి భరత్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షుడు కవీందర్‌గౌడ్, సీనియర్ నాయకులు ప్రసాద్‌గౌడ్, సాయికుమార్‌గౌడ్, కట్ట చంద్రశేఖర్‌గౌడ్, సత్యంగౌడ్, పెద్దశ్రీనుగౌడ్, లింగస్వామిగౌడ్, శ్రీనివాసులుగౌడ్, రవీంద ర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రాయన్‌పల్లిలో సీతారామచంద్రస్వామి కల్యాణం



భక్తులకు తాళిబొట్టు చూపిస్తున్న పూజారి ధేరం లక్ష్మణశర్మ

చారకొండ, మే 2: మండల పరిధిలోని చంద్రాయన్‌పల్లిలో వీరాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం ఆలయ చైర్మన్ సందడి సీతారాంరెడ్డి ఆధ్వర్యంలో సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా బ్యాండు మేళాల నడుమ ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని కనులార తిలకించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వసంతసాంబయ్య, ఆలయ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

‘పోరాటాలకు సిద్ధం కావాలి’

కొల్లాపూర్, మే 2 : మే డే స్ఫూర్తితో బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం మండల కార్యదర్శి బి.శివవర్మ పిలుపునిచ్చారు. కొల్లాపూర్ మండలంలో ముక్కిడిగుండం గ్రామంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా మే డే ఉత్సవాలు నిర్వహించిన కార్యక్రమానికి చంద్రునాయక్ అధ్యక్షత వహించారు. సీపీఎం పార్టీ జెండాను శాఖ కార్యదర్శి బి.బాలపీరు ఎగురవేశారు. సీపీఎం నాయకులు ఎస్.సేవ్యానాయక్, ఎ.కాశీం, పి.శంకర్, అంజినాయక్, శివకుమార్, శివశంకర్, రాజు, గోపినాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, స్వేరోస్ నాయకుల ప్రచారం

వెల్దండ, మే 2: నాగర్‌ర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపుకోసం గురువారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, స్వేరోస్ నాయకులు ప్రచారం చేశారు. స్థానిక కొండకత్వకుంట వద్ద ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలవద్దకు వెళ్లిన స్వేరోలు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు జంగిలి యాదగిరి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. పేదల సంక్షేమం కేసీఆర్ నాయకత్వంలోనే సాధ్యమయిందని ఈసందర్భంగా వారు పేర్కొన్నారు. నాయకులు జంగిలి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బాలాజీసింగ్

వెల్దండ, మే 2: కాంగ్రెస్ పాలనలోనే సుస్థిరపాలన, సామాజిక న్యాయం సాధ్యమని జడ్పీ వైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ అన్నారు. మండల పరిధిలోని పెద్దాపూర్‌లో గురువారం పీసీసీ అధికార ప్రతినిధి చారకొండ వెంకటేష్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటయ్యగౌడ్, నాయకులు కాటిక రామస్వామి, పోలేరాజు, బానోవత్ శంకర్ నాయక్, పర్వత్‌రెడ్డి, నమేష్‌నాయక్, పుల్లయ్య, ఎర్రశ్రీను, కడారి శ్రీనుయాదవ్, శేఖర్, జగన్, రాణి పాల్గొన్నారు.

‘సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం’

చారకొండ, మే 2: పేదరికాన్ని నిర్మూలిస్తూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీతోనే దేశంలో అన్నిరంగాల సమగ్ర అభివృద్ధి సాధ్యమని అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్‌లు అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన పథకాలే కాంగ్రెస్ గెలుపునకు పునాదులని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించాలని గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు గ్యార లక్ష్మయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి అంజయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ జగన్‌మోహన్, మండల యూత్ ప్రెసిడెంట్ గణేష్‌గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మయ్యగౌడ్, శంకరయ్యగౌడ్, గజ్జె కొండలయ్యగౌడ్, జేసీబీ వెంకటయ్యగౌడ్, కందికంటి శ్రీను, కందికంటి కిరణ్‌గౌడ్, గుండె శివగౌడ్, సత్తార్, ప్రసాద్‌గౌడ్, నర్సింహచారి, వీరబోజ పాల్గొన్నారు.

‘కాంగ్రెస్‌తోనే అభివృద్ధి’

కల్వకుర్తి, మే 2 : కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించాలని కల్వకుర్తి మాజీ జడ్పీటీసీ అశోక్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డిలు కోరారు. కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కేంద్రంలో రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని నాగర్‌కర్నూల్ ఎంపీ స్థానం నుంచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. నాయకులు శ్రీధర్‌రెడ్డి, జంగయ్య, నిజామోద్దీన్, శశిరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వెంకటయ్య, జలాల్, రాంచంద్రయ్య, దస్తగిరి, మల్లారెడ్డి, పాండు, స్వామి, రవి, యాదయ్య, శ్రీశైలం, ప్రేమ్‌కుమార్, శశిధర్, శ్రీను, వార్డు సభ్యులు గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం

పెద్దకొత్తపల్లి, మే 2 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవిని ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గులాం రసూల్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆవిరాల, పెద్దకార్పాముల, కొత్తయాపట్ల గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ప్రవేశపెట్టిన ఐదు గ్యారెంటీ పథకాలను ఇంటింటికి తిరిగి అందజేశారు. మండల యువజన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగబాబు, కార్యదర్శి బండి సాయిబాబు, సీనియర్ నాయకులు మల్లయ్య, రామస్వామి పాల్గొన్నారు.

మామిడి చెట్లను నరికిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

పెద్దకొత్తపల్లి, మే 2 : మండల పరిధిలోని బాచారం గ్రామంలో తాళ ఈశ్వరయ్య మామిడి చెట్లను నరికిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాచారం గ్రామ శివారులోని తమ పట్టాభూమి 67/ఊలో గల మామిడిచెట్లను అదే గ్రామానికి చెందిన గడ్డిగోపుల శ్రీనివాసులు ఆరు మామిడి చెట్లు, మూడు జామ చెట్లు, రెండు మునగ చెట్లు, ఒక నేరేడు చెట్టును నరికివేశాడు. మామిడిచెట్లను నరికేసిన వ్యక్తిపై తగు చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదులో కోరారు.

‘బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ప్రజాస్వామిక వ్యతిరేక పార్టీలు’

పెద్దకొత్తపల్లి, మే 2 : బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజాస్వామిక వ్యతిరేక పార్టీలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తెలంగాణ దళిత దండు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బచ్చలకూర బాలరాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని తీర్నాంపల్లి గ్రామంలో విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడే పార్టీ అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియమ్మ రుణం తీర్చుకోవాలంటే రాహుల్‌గాంధీని ప్రధానమంత్రి చేయాలని ఆయన అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. దళితదండు ఆ గ్రామ మాజీ సర్పంచ్ సాలయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్, శ్రీను, వెంకటయ్య, తెలంగాణ దళితదండు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాకర్, నియోజకవర్గ అధ్యక్షుడు చిన్న వెంకటస్వామి, మండల అధ్యక్షుడు మందాపురం నరసింహ, బచ్చలకూర రాములు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

కల్వకుర్తి, మే 2: కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ ఇంటర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ప్రారంభించామని ప్రిన్సిపాల్ ఎ.సురేందర్‌రెడ్డి తెలిపారు. ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మే 24న జరగబోయే సప్లిమెంటరీ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి సూచించారు. అధ్యాపకులు సదానందంగౌడ్, మల్లేష్, మహబూబ్‌అలీ, రాజేష్, జుబేర్, బాలరాజు ఉన్నారు.

ప్రతీ ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

కల్వకుర్తి, మే 2 : ఓటు హక్కు వినియోగంపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కల్వకుర్తి మునిసిపల్ కమిషనర్ ఆశిత్‌కుమార్ కోరారు. కల్వకుర్తి పట్టణ మహిళా సంఘం ఆధ్వర్యంలో గురువారం ఓటరు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం లాంటిదని, ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టణ మహిళా సంఘం సభ్యులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.